క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న కామిరెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ సమన్వయకర్త విజయసాయిరెడ్డిని డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని విజయసాయిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, సన్మానించారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం



సూచనలు చేస్తున్న సూపర్‌వైజర్ నిర్మల

కొడవలూరు: పోషకాహార లోపం తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే అనేక రకాల వ్యాధులు దూరమవుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల సూచించారు. మండలంలోని రామన్నపాళెం–1 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు విధిగా తీసుకోవాలన్నారు. తద్వారా పోషకాహార లోపాన్ని అధిగమించవచ్చని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత లోపిస్తే అనేక రకాల వ్యాధులు సోకే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రోజా, ఆశా కార్యకర్త మమత పాల్గొన్నారు.

ఏపీసీసీ ఎస్సీసెల్ వైస్ చైర్మన్‌గా మధు



నియామక పత్రం అందుకుంటున్న మధు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ఏపీసీసీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్‌గా బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన పి.మధు నియమితులయ్యారు. విజయవాడలోని ఏపీసీసీ కార్యాలయంలో ఆయన శుక్రవారం నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ తనపై నమ్మకముంచి ఎస్సీసెల్ వైస్ చైర్మన్‌గా నియమించినందుకు ఏపీసీసీ చైర్‌పర్సన్ షర్మిలతో పాటు పార్టీ పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి పాటుపడతానని వివరించారు.

పకడ్బందీగా పది పరీక్షలు



హెచ్‌ఎంతో మాట్లాడుతున్న ఎస్సై అజయ్‌కుమార్

మనుబోలు : పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో మనుబోలు జెడ్పీ బాలుర, బాలికల పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను శుక్రవారం పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హెచ్‌ఎం వసంతకుమారితో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి బయటి వ్యక్తులను పాఠశాల ఆవరణలోకి అనుమతించమన్నారు. జిరాక్స్ కేంద్రాలను మూసివేయిస్తామన్నారు. పరీక్షలు జరిగే సమయంలో పాఠశాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఆకతాయిలపై గట్టి నిఘా పెట్టినట్లు తెలియజేశారు.

పట్టుదలతో చదివితే విజయం

మనుబోలు : పట్టుదలతో చదివితే విజయం తథ్యమని ఎస్సై అజయ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. మనుబోలు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వెంకన్నపాళేనికి చెందిన స్వర్ణకుమారి తన మనుమడు చింటూ జ్ఞాపకార్థం అందజేసిన పరీక్ష సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డుకాదని, కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఏదైనా సాధ్యమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వసంతకుమారి, వీఆర్‌ఏ రమేష్, ఉపాధ్యాయులు ఉషారాణి, కృష్ణజ్యోతి, ప్రియాంక, మృదుల, పీడీ ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశానికి హాజరైన కార్యకర్తలు



మాట్లాడుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి

- వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- ఎంపీ విజయసాయిరెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట) : గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త వేణుంబాక విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని తన కార్యాలయంలో సోషల్ మీడియా కార్యకర్తలతో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రసార మాధ్యమాల్లో సోషల్ మీడియా అత్యంత శక్తివంతమైనదని, 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడానికి సోషల్ మీడియా విభాగం చేసిన కృషి అభినందనీయమన్నారు. అదే స్ఫూర్తితో 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసేందుకు సోషల్ మీడియా కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలోనే నెల్లూరు జిల్లా సోషల్ మీడియా టీమ్ అగ్రస్థానంలో ఉండేలా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. సోషల్ మీడియా కార్యకర్తలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని, అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ మేరకు సోషల్ మీడియా కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని, అలాగే తాము చేపట్టే కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం అందిస్తామని తెలియజేశారు. ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ సమన్వయకర్త ఎండీ ఖలీల్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉదారంగా సీఎంఆర్‌ఎఫ్ సాయం



సీయం సహాయనిధి చెక్కును అందజేస్తున్న మంత్రి కాకాణి

నెల్లూరు(దర్గామిట్ట) : సీఎం సహాయనిధి(సీఎంఆర్‌ఎఫ్) ద్వారా ఉదారంగా ఆర్థిక సాయం మంజూరు చేసి బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న ఆయన క్యాంపు కార్యాలయంలో సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను శుక్రవారం అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద అనేక వ్యాధులను చేర్చి సమర్థవంతంగా వైద్యసేవలు అందిస్తున్నామని, ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులకు వైద్యం చేయించుకున్న వారు అప్పులపాలు కాకుండా ఉండాలనే ఉద్దేశంతో సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. పేదల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ అన్నివర్గాలకు అండగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పెద్దాస్పత్రికి 20 వీల్‌చైర్ల వితరణ



నెల్లూరు(అర్బన్) : నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి)కి పది మంది స్నేహితులు కలిసి రూ.లక్షకు పైగా విలువైన 20 వీల్‌చైర్‌లను వితరణ చేశారు. వీటిని పెద్దాస్పత్రి, మెడికల్ కళాశాల అభివృద్ధి కమిటీ కో–ఆర్డినేటర్ లక్ష్మీసునంద చేతుల మీదుగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శిద్దానాయక్‌కు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా కో–ఆర్డినేటర్ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో అన్ని సౌకర్యాలున్నాయని, అయితే వీల్‌చైర్‌ల అవసరాన్ని వివరించగా కోట జనార్ధన్‌రెడ్డి, ఎం.వెంకటేశ్వరరెడ్డి, కె.ప్రసాద్‌రెడ్డి, ఎం.వేణు, పి.మురళీకృష్ణారెడ్డి, ఎస్.సతీష్, సీహెచ్.దిలీప్‌కుమార్, ఒ.మురళి, కె.సురేష్, ఎండీఆర్‌రెడ్డి తదితర మిత్ర బృందం వారు తక్షణమే స్పందించి వీల్‌చైర్‌లు అందించడం సంతోషకరమని తెలిపారు. అనంతరం దాతలను సన్మానించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ శిద్దానాయక్, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.నరేంద్ర, డాక్టర్ కళారాణి, డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ గంగాధర్, నర్సింగ్ సూపరింటెండెంట్ గిరిజ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రుణాల మంజూరు



దివ్యాంగులతో మాట్లాడుతున్న కాకాణి

నెల్లూరు(దర్గామిట్ట): కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థ నేషనల్ హాండీక్రాఫ్ట్ ఫైనాన్షియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన 19 మందికి రుణాలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. స్వయం ఉపాధి నిమిత్తం రూ.43,50,000లు మంజూరైనట్లు తెలిపారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న డీఎస్‌ఓ వెంకటరమణ

నెల్లూరు(పొగతోట) : వినియోగదారుల హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటామని డీఎస్‌ఓ వెంకటరమణ అన్నారు. నగరంలోని డీఎస్‌ఓ కార్యాలయంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వస్తువులను కొనుగోలు చేసినప్పుడు నాణ్యతా ప్రమాణాలు పరిశీలించాలన్నారు కస్టమర్లను మోసగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఏఎస్‌ఓ అంకయ్య పాల్గొన్నారు

నెల్లూరు వాసికి అవార్డు



ప్రిన్స్ డయానా అవార్డును అందుకుంటున్న శశాంకర్

నెల్లూరు(బారకాసు) : మైక్రో ఫైనాన్స్ ఇన్‌స్టిట్యూట్(ఎంఎఫ్‌ఐ) వ్యవస్థాపకుడు నెల్లూరుకు చెందిన కొరిశపాటి గోభాను శశాంకర్‌కు ప్రతిష్టాత్మక లెగసి(ప్రిన్స్ డయానా) అవార్డును అందుకున్నారు. లండన్‌లోని సైన్స్ మ్యూజియంలో డ్యూక్ ఆఫ్ కేంబ్రిడ్జి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యూకే క్రౌన్ ప్రిన్స్ విలియం ఆఫ్ వేల్స్ ప్రదానం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 20 మంది అసాధారణ యువ నాయకులలో ఒకరిగా కొరిశపాటిని గుర్తించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయాలు ఉంటాయని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

- తెలుగుగంగ సబ్‌స్టేషన్ పరిధిలోని ఏవీకే ఎస్టేట్, శాంతినగర్, డైకస్‌రోడ్డు, జేకే కాలనీ, చాణుక్యపురి, ఎన్‌టీటీ కాలనీ, శివాజీనగర్, వీఎమ్మార్ నగర్ పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుంది.
- రేబాల సబ్‌స్టేషన్ పరిధిలోని ఉస్మాన్‌సాహెబ్‌పేట, పుట్టవీధి, స్వర్ణహైట్స్, రామచంద్రాపురం, సాయిదీవెన అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయి.

ఆదాల పరామర్శ

నెల్లూరు సిటీ : సీపీఐ సీనియర్ నాయకుడు మముదుల దశరథ రామయ్యను నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. నెల్లూరు నగరంలోని ఆయన నివాసంలో ఈ మేరకు కలిసి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు.

ఎన్నికల నియమావళి తప్పక పాటించాలి



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ చిరంజీవి

మనుబోలు : ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు తప్పనిసరిగా ఎన్నికల నియమావళి పాటించాలని తహసీల్దార్ కె.చిరంజీవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు ఎన్నికల నియమావళిపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి ప్రక్రియ పూర్తయ్యే వరకు నియమావళి అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నియమ నిబంధనలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పార్టీలకు సంబంధించిన నాయకుల విగ్రహాలకు ముసుగు వేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ ప్రసాద్, వీఆర్వోలు నాగార్జునరెడ్డి, మురళీధర్, శ్రీనివాసులు ఉన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

కోవూరు : ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వర్తించాలని తహసీల్దార్ విజయశ్రీ అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో శుక్రవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి ప్రతి వీఆర్వో వారి పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సమాచారం పొందుపరుచుకోవాలన్నారు. అదేవిధంగా అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

స్వేచ్ఛగా ఓటు వేయాలి



కోవూరు : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కోవూరు మండలంలోని ప్రధాన గ్రామాల్లో సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు శుక్రవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేయాలన్నారు. లేగుంటపాడు, వేగూరు, ఇనమడుగు తదితర గ్రామాల్లో కవాతు సాగింది. కార్యక్రమంలో ట్రెయినీ డీఎస్పీ హేమలత, కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం



పార్టీలో చేరిన మహిళలతో ఎంపీ ఆదాల

- రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ : వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతిఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 30వ డివిజన్ వైఎస్సార్ నగర్‌కు చెందిన 50 మంది మహిళలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. నగరంలోని ఆదాల క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ నగర్‌కు చెందిన వసంతమ్మ వారి మిత్రబృందం వారికి పార్టీ కండువాలు కప్పి ఆదాల సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ భవిష్యత్తులో అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. 30వ డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకులు వీరప్పరెడ్డి నారాయణరెడ్డి, ముత్తంగి రామయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నవీన్‌రెడ్డి, చిన్న, రత్తయ్య, అనిల్, రత్నమ్మ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మీ బిడ్డగా సేవ చేసుకుంటా..



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఖలీల్ అహ్మద్

- వైఎస్సార్‌సీపీ నగర సమన్వయకర్త ఖలీల్ అహ్మద్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : మీ బిడ్డగా ఉండి సేవ చేసుకుంటానని, ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, ఒక్క అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నగర నియోజకవర్గ సమన్వయకర్త ఎండీ ఖలీల్‌అహ్మద్ పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని 44వ డివిజన్ మధ్వపతివారి అగ్రహారం, రాయాజీవీధి, మధ్వపతివారి వీధి, యడ్లవారివీధి తదితర ప్రాంతాల్లో ఆయన శుక్రవారం ఇంటింటికీ వెళ్లి నవరత్నాల కరపత్రాలను అందజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలును వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన రాష్ట్రాభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలతో ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితే నవరత్నాల పథకాలు మళ్లీ అందుతాయన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయని గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు సిటీ నుంచి తనను గెలిపించాలని కోరారు. అలాగే వైఎస్సార్‌సీపీ తరఫున ఎంపీగా పోటీ చేయనున్న వేణుంబాక విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నీలి రాఘవరావు, వైఎస్సార్‌సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

మసీదుల వద్ద పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఎంహెచ్‌ఓ వెంకటరమణ

నెల్లూరు(బారకాసు) : రంజాన్ ఉపవాస దీక్షల నేపథ్యంలో నగర వ్యాప్తంగా ఉన్న అన్ని మసీదుల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ తెలియజేశారు. స్థానిక పెద్ద బజారు సమీపంలోని మసీదు ప్రాంగణం, ఆచారివీధి, నవాబుపేట తదితర ప్రాంతాలో్ల్ జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా నగర వ్యాప్తంగా అన్ని డివిజన్ల కాలువల్లో సిల్ట్ తొలగించి మురుగు పారుదలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పందులు, పశువుల నియంత్రణకు, దోమల నివారణకు అవసరమైన ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలియజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎంపీ ఆదాల

నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలోని 36వ డివిజన్‌కు చెందిన యనమల ప్రభుదాస్‌కు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కును నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. నెల్లూరు నగరంలోని ఆయన నివాసంలో ఈ మేరకు అందించారు. ఈ సందర్భంగా ఆదాలకు ప్రభుదాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా షేక్ రసూల్‌కు కూడా సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు గుర్తింపు ఇవ్వాలి



పాదయాత్ర చేస్తున్న గ్రామీణ ప్రాథమిక వైద్యులు

నెల్లూరు(అర్బన్) : గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్యం అందించే వైద్యులకు గుర్తింపు ఇవ్వాలని కమ్యూనిటీ పారామెడిక్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షుడు ఎస్కే సిరాజ్ కోరారు. గ్రామీణ వైద్యులకు గుర్తింపు ఇవ్వాలని కోరుతూ అనకాపల్లి జిల్లా నుంచి బేసిక్ హెల్త్ కేర్ మెడికల్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుమలకు జరుగుతున్న పాదయాత్ర శుక్రవారం నెల్లూరుకు చేరుకుంది. వీరికి నెల్లూరు కమ్యూనిటీ పారామెడిక్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బైపాస్‌రోడ్డులో స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు. గతంలో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో గ్రామీణ వైద్యులకు ఎలాంటి గుర్తింపు ఇచ్చారో అదేవిధంగా ఇప్పుడు కూడా ప్రభుత్వం గుర్తింపునిచ్చి శిక్షణ ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వీఎల్ నారాయణరావు, ధనలక్ష్మి, వెంకటరమణ, రాజేష్, భాను, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

దేవగిరిక్షేత్రంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఉభయకర్తలు

నెల్లూరు సిటీ : రూరల్ మండలంలో కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత దేవస్థానం ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు విశేషాలంకరణ చేశారు. అనంతరం వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, పూజలు జరిపించారు. ఉభయకర్తలుగా బెంగళూరుకు చెందిన అడపాల నరేశ్, మంజుల కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.